క్లుప్తంగా

తైక్వాండోలో సత్తాచాటిన తుక్కుగూడ వాసులు



అవార్డులతో తైక్వాండో క్రీడాకారులు

తుక్కుగూడ: తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్, తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ సయుక్తంగా సోమవారం నగరంలోని అంబర్‌పేట జీహెచ్ఎంసీ ఇండోర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర 5వ తైక్వాండో చాంపియన్‌షిప్ 2023 పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ (గార్డేనియా గ్రోవ్ విల్లాస్ రాంకీ డిస్కవరి సిటీ)కి చెందిన హవీష్, ధృవ, ధృతి, రిషాన్ నలుగురు క్రీడాకారులు పాల్గొని సత్తాచాటారు. ఈ సందర్భంగా సోమస్పిట్ ట్రైనింగ్ అకడామీ మాస్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ... తమ అకడామీకి చెందిన క్రీడాకారులు పాల్గొని అవార్డులను పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీటీఏ వాజొద్దీన్, క్రీడాకారులుపాల్గొన్నారు.

‘పల్లెప్రగతి’ని విజయవంతం చేద్దాం

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

కడ్తాల్: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 15న నిర్వహించే పల్లె ప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. సోమవారం ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. 14న నిర్వహించే మహిళా సంక్షేమ దినోత్సవం, 15న నిర్వహించే పల్లెప్రగతి దినోత్సవాల్లో ప్రజలను భాగస్వామ్యులను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ మధు సూదనాచారి, ఏఈఈ శ్రావ్య, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుకు కాడెద్దు మృతి

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్టతండాలో ఆదివారం రాత్రి పిడుగుపాటుకు రెండు కాడెద్దు మృతిచెందాయి. తండాకు చెందిన ఆమనగల్లు సింగిల్‌విండో డైరెక్టర్, రైతు దోల్యానాయక్ తన కాడెద్లను రోజు మాదిరిగానే వ్యవసాయ పొలం వద్ద ఉంచాడు. ఆదివారం రాత్రి పిడుగు పడటంతో రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతిచెందాయి. వాటి విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు. విషయం తెలుసుకున్న ఆమనగల్లు సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ చైర్మన్ సత్యం, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్‌లు సోమవారం బాధిత రైతును పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌గుప్తా వ్యక్తిగతంగా రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్‌లు వెంకటయ్య, శ్రీపాల్, రమేశ్, సీఈఓ దేవేందర్, స్థానికులు రమేశ్‌నాయక్, గన్యానాయక్, చంద్రునాయక్, హీరాసింగ్, రవీందర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పీఎస్ గ్రామ కమిటీ నియామకం

తలకొండపల్లి: ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి(ఎస్ఆర్‌పీఎస్) గ్రామ కమిటీని సోమవారం ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కడమంచి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా వారణాసి కుమార్, కోశాధికారిగా సరిగిరి రమేశ్, కార్య వర్గ సభ్యులుగా గణేశ్, శ్రీశైలం, రాము, శివ, భాస్కర్‌లు నియమితులయ్యారు. మండలాధ్యక్షుడు పవన్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ సమక్షంలో నిర్వహించిన ఈ ఎన్నికలో జిల్లా అధ్యక్షుడు జికుకుంట్ల భాస్కర్, ప్రధాన కార్యదర్శి వినోద్, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీశైలం, రామలింగ, శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

‘గిరిజన బంధు’ అమలు చేయండి

దిల్‌సుఖ్‌నగర్: గిరిజనులకు గిరిజన బంధును తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో అమలు చేస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న ఎల్‌బీనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రామావత్ పాండు నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు మూడవత్ గోపి నాయక్‌లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనలకు గిరిజన బంధును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రైతు బజారులో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజారుల్లో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాట 35, వంకాయ 28, బెండ 40, పచ్చి మిర్చి 55, కాకర 38, బీర 35, క్యాబేజి 13, ఫ్రెంచిబీన్స్ 85–125, క్యారెట్ 53, దొండ 28, చిక్కుడు 85, గోకర 40, బీట్‌రూట్ 23, క్యాప్సికం 55, ఆలు 20, దోస 15, సొర 13, పొట్ల 13, ఉల్లి 16, చామగడ్డ 35. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

పొంచి ఉన్న ప్రమాదం



అల్మాస్‌గూడ రోడ్డులో మ్యాన్‌హోల్



రోడ్డు పక్కన ప్రమాదకరంగా చెట్ల మొదళ్లు

- అల్మాస్‌గూడ ప్రధాన రోడ్డు విస్తరణలో కాంట్రాక్టర్ అలసత్వం
- రోడ్డు పొడవునా గుంతలు, మ్యాన్‌హోళ్ల ఎత్తుపెంచని వైనం
- ప్రమాదాలబారిన వాహనదారులు

మీర్‌పేట: రహదారిని విస్తరించడంతో పాటు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.. అంతా బాగానే ఉన్నప్పటికీ ఆ రహదారిపై మ్యాన్‌హోళ్ల గుంతలు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ అంబేడ్కర్ విగ్రహం నుంచి అల్మాస్‌గూడ కమాన్ వరకు గల ప్రధాన రహదారిని ఇటీవల విస్తరించి అభివృద్ధి చేస్తున్నారు. రహదారి పొడవునా గుంతలు ఉండటంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

మ్యాన్‌హోళ్ల ఎత్తు పెంచరూ..

రహదారిని విస్తరించిన అధికారులు మ్యాన్‌హోళ్ల గుంతలను రహదారికి సమాంతరంగా చేయకపోవడంతో దగ్గరకు వచ్చేవరకు గుంతలు ఉన్నది తెలియడం లేదని వాహనదారులు చెబుతున్నారు. కొన్నిచోట్ల మ్యాన్‌హోళ్లు రహదారికి ఎత్తులో ఉన్నాయి. రహదారి విస్తరణలో రోడ్లకు ఇరువైపులా వృక్షాలను తొలగించి మొదళ్లను అలాగే వదిలేయడంతో వాహనదారుల పాలిట శాపంగా మారాయి. రహదారిని అభివృద్ధి చేసిన కాంట్రాక్టర్ గుంతలను అలాగే వదిలేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ సరిగ్గాలేకపోవడంతోనే కాంట్రాక్టర్ మ్యాన్‌హోళ్లను రోడ్డుకు సమాంతరంగా చేయకుండా వదిలేశాడని.. అధికారులు చొరవ తీసుకుని మ్యాన్‌హోళ్లను రోడ్డు లెవల్‌కి వచ్చేలా పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

మ్యాన్‌హోళ్లను సరిచేస్తాం

రహదారి విస్తరణ పనులు పూర్తయినప్పటికీ ఇంకా విద్యుత్ స్తంభాల మార్పిడి, సెంట్రల్ లైటింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి వాహనదారులకు ఇబ్బందులు రాకుండా రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలు, మ్యాన్‌హోళ్లను సరిచేస్తాం. అదే విధంగా వృక్షాల మొదళ్లను తొలగిస్తాం. త్వరగా సమస్య పరిష్కరిస్తాం. – నాగేశ్వర్, కమిషనర్, మీర్‌పేట కార్పొరేషన్

సీఎంఆర్‌ఎఫ్‌తో నిరుపేదలకు మేలు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న సరేందర్‌రెడ్డి, జంగారెడ్డి

మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి

కందుకూరు: సీఎంఆర్‌ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని ముచ్చర్లకు చెందిన అంజయ్యకు రూ.60 వేలు, రాఘేందర్‌కు రూ.15 వేలు, గుమ్మడవెల్లికి చెందిన వెంకటేష్‌కు రూ.35 వేలు, దావూద్‌గూడకు చెందిన చంద్రుకు రూ.60వేల నిధులు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరయ్యాయి. సోమవారం లబ్ధిదారులకు వారు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్, సర్పంచ్‌లు రాంచంద్రారెడ్డి, విజయరాజునాయక్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు నర్సింహ, మస్కు బాబు, పార్టీ యూత్ నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల కార్తీక్, విఘ్నేశ్వర్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ దీక్షిత్‌రెడ్డి, యూత్ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కోశాధికారి కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు మహిళా భద్రతపై సదస్సు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో తెలంగాణ దశాబ్ధి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బోయిని మహేందర్ యాదవ్ తెలిపారు. మహిళల భద్రత, వారిపై జరుగుతున్న దాడులపై అవగాహన సదస్సు ఉంటుందని.. ఈ సదస్సుకు మంత్రి సబితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కందుకూరు: మండల పరిధిలోని ధన్నారం గ్రామానికి చెందిన మన్నెగూడెం నర్సింహులు ఇటీవల మరణించగా.. ఆయన కుటుంబ సభ్యులను మార్కెట్ కమిటీ డైరెక్టర్ పిట్టల పాండు సోమవారం పరామర్శించారు. రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. అధైర్యపడవద్దని అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట ఉప సర్పంచ్ పాపమ్మ, వార్డు సభ్యుడు వజ్ర రమేష్, నాయకులు నర్సింహ, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

టీచింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహేశ్వరం: మహేశ్వరం ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో తాత్కాలిక పద్ధతిలో గంటల ప్రాతిపాదికన బోధన చేయుటకు (హావర్లీ బేస్డ్ టీచర్స్) వివిధ సబ్జెక్టుల వారీగా అనుభవం, విద్యార్హత గల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ధనుంజయ్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ... 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బోధించుటకు తెలుగు-2, ఇంగ్లీష్-2, కెమిస్ట్రీ-1, బాటనీ-1, సివిక్స్-1, ఎకానమిక్స్-1, కామర్స్-1 సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ మరియు బీఈడీ కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు తెలుగు-1, ఇంగ్లీష్-1, హిందీ-2, గణితం -1, సైన్స్-1, సోషల్ -1 సబ్జెక్టులు బోధించుటకు ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్‌గా పనిచేయుటకు డిగ్రీ, బీఈడీతో పాటు టెట్ పరీక్ష అర్హత అయిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించడమైంది. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు మరిన్ని వివరాలకు మహేశ్వరం మోడల్ స్కూల్‌లో 9849746567, 9912617121, 9603150011 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

పోలీసుల కృషితో తగ్గిన క్రైం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ప్రజల రక్షణకు 24 గంటల పాటు పోలీసులు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఖానాపూర్ సమీపంలోని గురుకుల విద్యాపీఠం నుంచి ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తా వరకు నిర్వహించిన తెలంగాణ రన్‌ను డీసీపీ శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోలీసుల కృషితోనే మన ప్రాంతంలో క్రైం రేట్ తగ్గిందన్నారు. అనంతరం డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తులకు పోస్టులు పెట్టి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు, ఆర్డీఓ వెంకటాచారి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, ఎంపీపీ కృపేశ్ పోలీసు అధికారులు, బీఆర్‌ఎస్ నేతలు, విద్యార్థులు, యువతీయువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, చిత్రంలో డీసీపీ శ్రీనివాస్

కబ్జాదారులపై పీడీ యాక్టు నమోదు చేయండి

తుర్కయంజాల్: మాసబ్ చెరువు భూ కబ్జాదారులపై వాల్టా చట్టం క్రింద కేసులు చేసి పీడీ యాక్టు నమోదు చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పోలీసులను కోరారు. సోమవారం ఆయన ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి చెరువును పరిశీలించారు. 205 సర్వే నెంబర్‌లో మట్టి డంప్ చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. నిత్యం ఇద్దరు పోలీసులతో గస్తీ ఏర్పాటు చే యాలని ఏసీపీ ఉమామహేశ్వరరావు, సీఐ రవి కు మార్‌కు సూచించారు. కోర్టు ఉత్తర్వులను అడ్డంపె ట్టుకుని ఇష్టానుసారంగా వ్యవహరించిన కబ్జాదారుల ఆటలు సాగవని హెచ్చరించారు. ఇరిగేషన్ అ ధికారులు కౌంటర్ దాఖలు చేయాలన్నారు. మొత్తం చెరువు విస్తీర్ణం 520 ఎకరాలకు గాను, ప్రస్తుతం 495 ఎకరాలుగా చూపిస్తున్నారని, హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు చెరువును మొత్తం సర్వే చేసి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను గుర్తించాలన్నారు. ఎవరైతే డంప్ చేశారో వారి నుంచే డబ్బులను రికవరీ చేసి మట్టి తొలగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, చెరువు పరిరక్షణ సమితి అధ్యక్షుడు రమేశ్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కల్యాణ్ నాయక్, నాయకులు లక్ష్మారెడ్డి, ముత్యంరెడ్డి, విజయానంద రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, యాదిరెడ్డి, శ్రీనివాస్, సంపతీశ్వర్ రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘తెలంగాణ రన్’



2-కే రన్‌లో సీఐ ఉపేందర్, శ్రీనివాస్‌రెడ్డి, రాంపాల్‌నాయక్, పత్యానాయక్ తదితరులు

ఆమనగల్లు: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆమనగల్లు పట్టణంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నిర్వహించిన 2–కె రన్ ఉత్సాహంగా జరిగింది. పట్టణంలోని పోలీసు స్టేషన్‌ఆవరణలో ఈ రన్‌ను సీఐ ఉపేందర్ ప్రారంభించారు. పట్టణానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు, యువజన సంఘాల నాయకులు, క్రీడాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక పట్టణంలోని పోలీసు స్టేషన్ నుంచి మార్కెట్ యార్డు, బస్టాండ్, పోస్టాఫీసు, ప్రభుత్వాసుపత్రి మీదుగా ఈ రన్ కొనసాగింది. ఆమనగల్లు సీఐ ఉపేందర్, ఎస్ఐ సుందరయ్య, కడ్తాల ఎస్ఐ హరి శంకర్‌గౌడ్, తలకొండపల్లి ఎస్ఐ వెంకటేశ్‌యాదవ్, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, సర్పంచ్‌లు సోన శ్రీనునాయక్, లక్ష్మణ్, ఎంపీటీసీ సభ్యులు కుమార్, పంతునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో మహంకాళీ దేవాలయ జీర్ణోధరణ పూర్వక మూర్తి ప్రతిష్ఠ ధ్వజ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక పూజలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహేశ్వరం గ్రామంలో ముదిరాజ్ కులస్తులు మహంకాళీ అమ్మవారి ఆలయ పునఃనిర్మాణం చేయడం అభినందనీయమన్నారు. ప్రతి గ్రామంలో ఆలయాలు నిర్మాణం చేసుకోవాలని సూచించారు. ఇంద్రారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహరాజ్, దుర్గమ్మ ఆలయాలను నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. ఇటీవల 40 అడుగుల భారీ శివుడి విగ్రహాన్ని కొత్వాల్ చెర్వు కట్టపైన ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మంత్రి, జెడ్పీచైర్‌పర్సన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం గ్రామ సర్పంచ్ కర్రోళ్ల ప్రియాంక, శివగంగ రాజరాజేశ్వర ఆలయ డైరెక్టర్ కర్రోళ్ల చంద్రయ్య, ముదిరాజ్ సంఘం నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు జంగయ్య, రాములు, చంద్రయ్య, శ్రీనివాస్, కాకి ఈశ్వర్, పరమేష్, శ్రీహరి, జంగయ్య, కాకికుమార్, రవీందర్, రాజేష్, అడివయ్య, రామచంద్రయ్య పలువురు పాల్గొన్నారు.



పూజలో మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

ఆలయంలో ప్రత్యేక పూజలు

మండల కేంద్రంలో మహంకాళీ దేవాలయ జీర్ణోద్ధరణ పూర్వక మూర్తి ప్రతిష్ఠ, ధ్వజప్రతిష్ఠ, మహాకుంభాభిషేక పూజలు సోమవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గజస్థంభ ప్రతిష్ఠ, హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదా న కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం సర్పంచ్ ప్రియాంక, శివగంగ రాజరాజేశ్వర ఆలయ డైరెక్టర్ చంద్రయ్య, ముదిరాజ్ సంఘం నాయకులు జంగయ్య, రాములు, ఈశ్వర్, రా జేష్, శ్రీహరి, పరమేష్, భిక్షపతి, శ్రీనివాస్, కుమా ర్, రామచంద్రయ్య, కోటయ్య, లింగయ్య, అడివ య్య, రవీందర్, మహేష్ పలువురు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



వడ్డెర సంఘం భవనానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ జంగారెడ్డి

జెడ్పీటీసీ సభ్యుడు జంగారెడ్డి

కందుకూరు: మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ముచ్చర్లలో స్థానిక సర్పంచ్ రాంచంద్రారెడ్డి, వడ్డెర సంఘం నాయకుడు డి.మోహన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోటా నుంచి మంజూరైన రూ.10 లక్షల నిధులతో వడ్డెర సంఘం భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని కులాలు, మతాలకు సమ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని కులసంఘాలకు ప్రత్యేకంగా భవనాలు మంజూరు చేస్తుందన్నారు. మంత్రి సబితారెడ్డి సహకారంతో మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ మల్లేశ్,మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్, పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, రామకృష్ణ, నర్సింహ, దామోదర్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, వడ్డెర సంఘం అధ్యక్షుడు రాఘవేందర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

సగరులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

అఖిలభారత సగర మహాసభ అధ్యక్షుడు విజేందర్‌సాగర్

బడంగ్‌పేట్: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ సగర సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం నిర్వహించిన సగర సంఘం సమావేశంలో.. అఖిలభారత సగర మహాసభ అధ్యక్షుడు శంశెట్టి విజేందర్‌సాగర్, జాయింట్ సెక్రెటరీ రాజేష్ ఎన్నికల పర్యవేక్షలుగా వ్యవహరించారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ సగర సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్ సాగర్, ఉపాధ్యక్షులుగా ఇంద్రాల వెంకటేష్‌సాగర్, వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బి.శ్రీకాంత్ సాగర్, కోశాధికారి అనిల్‌సాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముత్యాల వాసుసాగర్, వైస్ ప్రెసిడెంట్‌గా బాదం బాబురావు సాగర్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన సభ్యులు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం సగరుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాలని కోరారు. వెనుకబడ్డ సగరుల కుటుంబాలకు మేలు చేసేవిధంగా సగరుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేడంతో పాటు సగరులకు రాష్ట్రవ్యాప్తంగా కొన్ని నియోజకవర్గాలను కేటాయించి రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని కోరారు. సగరుల కుటుంబాలకు ప్రత్యేక బ్యాంకు రుణాలు, సబ్సిడీలు అందించే ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా తీర్మానం చేశారు.



ఐక్యత చాటుతున్న సగర కమిటీ సభ్యులు

ఓర్వలేకే ఉత్సవ పోస్టర్ల చింపివేత



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మయ్య యాదవ్

బీజేపీ నేతల తీరుపై బీఆర్‌ఎస్ నాయకుల ఫైర్

తుక్కుగూడ: బీజేపీ నాయకులు ప్రభుత్వం వేసిన పోస్టర్లను మాత్రమే చింపివేయగలరు... కానీ బీఆర్‌ఎస్ మీద ప్రజల్లో ఉన్న ప్రేమను మాత్రం చెరపలేరు అని తుక్కుగూడ మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్ స్పష్టం చేశారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో ఆపార్టీ కౌన్సిలర్లు, నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ... తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అధికారులు మున్సిపాలిటీ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను బీజేపీకి చెందిన కొన్సిలర్లు చింపివేయడం విచారకరమన్నారు. ప్రజాప్రతినిధి హోదాలో ఉండి ప్రభుత్వ ప్రచారం అడ్డుకోవడం తగదన్నారు. తుక్కుగూడ మున్సిపల్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు వివరాలను తెలియజేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి సబితారెడ్డి చేస్తున్న పనితీరుని చూసి ఓర్వలేక బీజేపీ కౌన్సిలర్లు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికైన ఇలాంటివారు తమ బుద్ధిని మార్చుకొని మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ కౌన్సిలర్లు రవినాయక్, నాయకులు బూడిద శ్రీకాంత్, శ్యామేల్ రాజు, బాట సురేష్, శివశంకర్, వెంకటరాజీరెడ్డి, సురేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకుంటను కాపాడండి

తహసీల్దార్‌కు ముదిరాజ్ సంఘం నాయకుల వినతి

తలకొండపల్లి: మండల కేంద్రంలోని ఎర్రకుంట చెరువు కబ్జాకు గురి కాకుండా చూడాలని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. చెరువు పరిసర ప్రాంత రైతులు కొందరు, చెరువులోకి వెళ్లకుండా చెరువు బాటను దున్ని కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చెరువుకు ఉన్న భూ విస్తీర్ణం ఎంత, ఎంత విస్తీరణంలో కబ్జాకు గురైంది, సర్వే చేయించి నిజ నిర్ధారణలు పరిశీలించి తగిన న్యాయం చేయాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా సర్వే చేయించి పరిశీలించి కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విట్టల్, శ్రీకాంత్, నరేశ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు